ఆఫీసర్ బదిలీ అయి వచ్చిన రోజు, ఆక్సిడెంటయి కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయిన రోజు, ఆయన స్కూటర్ దొంగలెత్తుకు పోయిన రోజు, ఆయన తల్లి మరణించిన రోజు, ఒక కోర్టు కేసులో వోడిపోయిన రోజు.... దాదాపు పాతిక నంబర్లు ప్రయత్నించారు కాని బ్రీఫ్‌కేస్ తెరుచుకో లేదు

"లాభం లేదమ్మా. నాన్నగారినే అడుగు."

ఆవిడ ఎర్నాకుళానికి ట్రంకాల్ చేసింది. నాలుగో తారీఖు ఉదయం గంటన్నర తర్వాత వచ్చింది కాల్. ఆయన లైన్‌లోకి వచ్చాక కంగారుగా అడిగారు.

"ఏమిటి? ఏమైంది?"

"ఏం లేదు. మన ఏకోరేక్ తెరచే నంబర్ మరచిపోయాను."

"పాస్ బుక్‌లో రాసుకున్నావుగా?"

"అది కనబడలేదు. ఆ నంబరేమిటో మీకు గుర్తుందా?"

"ఉంది"

"చెప్పండయితే."

"ఎలా మరచిపోగలను? రెండు, అయిదు, ఏడు."

"అంటే జూలై ఇరవై అయిదా?" కొద్దిక్షణాలు ఆలోచించి అడిగింది.

"అవును."

"అవును." "అన్నట్టు అది మన పెళ్ళిరోజు!!!"

అవతలవైపు అనురాధ మొగుడు లైన్ కట్ చేశాడు.

## రెండో తప్పు

సోమనాథ్ జీవితంలో చేసిన ఏకైక తప్పు తన ఏభై రెండవ ఏట జ్వాలని పెళ్ళి చేసుకోవటం. ఆమె వయస్సు ఇరవై రెండు. ఒకానొక

బుద్ధి గడ్డితిన్న ఘడియలో ఆమెని వివాహం చేసు కోవాలనుకున్నాడు. చేసుకున్నాడు

తన వ్యాపార వ్యవహారాలు చూసుకోడానికి సోమనాధ్ తరచూ ఇతర వూళ్ళు వెళుతుండాలి. నాలుగైదు రోజులు తను దూరంగా వున్నప్పుడు జ్వాల తన ఆఫీస్ మేనేజర్ తోనో, ఎదురింటి ఇంజనీర్ జానపరిదితోనో తిరుగుతోందనే గాఢమైన నమ్మకం సోమనాధ్ లో ఏర్పడి పోయింది.

ఈ వయస్సులో ఇది ఆయనకో మానసిక బాధగా మారింది. తన అనుమానానికి అనేక కారణాలు వున్నాయి.

ఆలోచించి చివరకి ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఓ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీ ఆఫీస్‌కి వెళ్ళి జ్వాల ఫొటో ఇచ్చాడు. ఆమె శీలాన్ని తను శంకిస్తున్నానన్న సంగతి చెప్పకుండా నాలుగు రోజుల పాటు ఆమెని ఇరవైనాలుగంటలూ కనిపెట్టి, ఆమె దిన చర్యని యధాతదంగా రిపోర్ట్ రాసివ్వమని కోరాడు. రోజుకి రెండు వందల రూపాయల చొప్పున నాలుగు రోజులకు ఎనిమిదివందల రూపాయలు చెల్లించాడు. ఈసారి వైజాగ్‌కి నిశ్చింతంగా వెళ్ళాడు.

జ్వాల కేరక్టర్ లేనిదని ఆ రిపోర్టువల్ల రుజువయింది, జ్వాలకి ఆ రిపోర్టు చూపించి, సంబంధం తెంచేసుకోదలుచుకున్నాడు.

అయిదోరోజు ఉదయం విజయవాడ చేరుకున్నాడు సోమనాధ్ రైల్వే స్టేషన్‌నించి సరాసరి ఆ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీ ఆఫీస్‌కి వెళ్ళాడు.

“నే చెప్పిన పని చేసారా?” అడిగాడు.

టైపు చేసిన రిపోర్టు వున్న కవరు సిద్ధంగా వుంది. దాన్ని తీసుకుని ఇంటికి వెళుతూ ఆటోలో దారిలో చదివాడు సోమనాధ్ పూర్తి చేసే సరికి తను చేసిన రెండో తప్పు బోధపడింది.

మంగళవారం

రాత్రి ఏడింటికిగాని జ్వాల కదల్లేదు. మాదవరానికి రిక్షా మాట్లాడుకుంది, ఆఫీస్ మేనేజర్ యింటికి. ఏడున్నరకి ఓ లారి ఆ రిక్షాని ఎస్. ఆర్. ఆర్ కాలేజీకి కొద్దిగా ఇవతలగా గుద్దేసింది. ఆమెని వెంబడిసున్న డిటెక్టివ్ వెంటనే ఆమెని హాస్పటల్ లో చేర్పించక పోతే మరణం తప్పేదికాదు.

బుధవారం

హాస్పటల్లోంచి కదల్లేదు. మీ ఆఫీస్ మేనేజర్ వచ్చి నాలుగు గంటలు ఆమెతో కబుర్లు చెప్పి వెళ్ళాడు.

గురువారం

షరా....

శుక్రవారం

షరా; ఇవాళ మీ ఎదురింటి ఇంజనీర్ బావమరిది కూడా చూసి వెళ్ళాడు.

డిటెక్టివ్ని నియమించి జ్వాల ప్రాణాన్ని కాపాడి తను రెండో తప్పు చేసాననుకున్నాడు సోమనాధ్.

## అటు ది టు

హైద్రాబాద్ సంబంధం అనగానే సర్వలక్ష్మికి ఎంతో ఆనందం కలిగింది. ఖమ్మం సంబంధం బదులు ఆ సంబంధం కుదరాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది.

కనీసం ఏ దేముడైనా కరుణించి వుంటాడు. హైద్రాబాద్లో నేషనల్ సేంపిల్ సర్వే కార్యాలయములో పనిచేసే రమేష్తో ఆమె వివాహం జరిగిపోయింది.

సర్వలక్ష్మికి హైద్రాబాద్లో కాపరం కావాలనుకోడానికి ముఖ్య కారణం అక్కడున్న టేంక్బండ్ అనేక తెలుగు సినిమాల్లో టేంక్ బండ్ని చూసింది. పెళ్ళయ్యాక తనభర్త టేంక్బండ్ మీద వుండే